కథానిక

# బంధనం



\- శివాజీ ప్రసాద్

ఆ వార్త విన్నవెంటనే నా మెదడంతా ఒక్కసారి శూన్యమైంది. గుండెను పిండేస్తున్నట్టు భావన. వెన్నులో సన్నగా వణుకు... నన్ను నేను కంట్రోల్ చేసుకుని గబగబా బయల్దేరాను.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఇక్కడ నుంచి చలపతి ఇల్లు ఒక కిలోమీటరు వుంటుంది. అడుగులు వడివడిగా పడుతున్నాయి. కాళ్ళు తమ పని తాము యాంత్రికంగా చేసుకుపోతున్నాయి. మెదడు మాత్రం గతాన్ని తవ్వుతోంది.

రెండేళ్ళ క్రితం నాటి మాట.. ఓ రోజు... ఉపిరాడని సిటీ బస్సులో ఆ నరకం తాలూకు అనుభూతి నుంచి బయటపడడానికి మహ్మద్ రఫీ పాట స్వగతంలో పాడుకుంటున్నాను. జనం రద్దీ ఎక్కువగా వుంది. పెరిగిపోతున్న జనాభా మీద ఒక మంచి వ్యాసం రాయవచ్చు. నిలబడిన ప్రతి ఒక్కడూ బస్సులో సీటు కోసం గద్దలా చూస్తున్నాడు. అంతలో నాకు నా ఫ్రెండు 'రమణ' ప్రక్కన సీటు దొరికింది. మా ముందు సీటులో కూర్చున్న ఓ ముచ్చటయిన జంట మీదకి మా సంభాషణ మళ్ళడం సహజం.

"నేను బస్ ఎక్కిన దగ్గర నుంచీ అబ్జర్వ్ చేస్తున్నాను. ఈ దంపతులు తెగ మాట్లాడేసుకుంటున్నారు. ముచ్చటగా వుంది కదూ జంట!" రమణ అన్నాడు.

అంతకుముందు నుంచీ నేను అనుకుంటున్న విషయమే అతడూ అనేసరికి నా దృష్టి మళ్ళీ ఓ క్షణం పాటు ఆ జంటపై నిలిచింది. యితే ఈ వివాహ వ్యవస్థ మీదా, భార్యాభర్తల అను బంధం మీదా సదభిప్రాయం లేని నేను అతనితో విభేధించాలని నిర్ణయించుకున్నాను.

"ప్రేమగా మాట్లాడుకోవడం నిజమే కావచ్చు. గానీ వాళ్ళిద్దరూ భార్యాభర్తలు కారని ఖచ్చితంగా చెప్పగలను" వారికి వినబడాలనే కొద్దిగా గొంతు హెచ్చించి అన్నాను. మా ముందు సీటులోనే కూర్చున్న వారిద్దరికీ ఎటువంటి శ్రమ లేకుండానే మా మాటలు వినబడతాయని నాకు తెలుసు. రమణ అంతటితో ఆగక "ఏం?" అన్నాడు.

"వాళ్ళ మధ్య కనిపిస్తున్నది సహజ ప్రేమ కాబట్టి" పదునుగా అన్నాను. భార్యభర్తల పరస్పర నటన, కృత్రిమత్వ జీవన విధానాల మీద గట్టి చురక వేశానని చాలా ఆనందంగా వుంది నాకు.

అంతలో బస్ స్టేజీ దగ్గర ఆగడం ఆ చిలకా గోరింక లేవడం– గోరింక నా వైపు తిరిగి,

"నాణేనికి రెండో వైపు కూడా చూడడం అలవాటు చేసుకో బాబూ–!" అని అనడం యాధృచ్ఛికంగా జరిగిపోయింది. ఆయన మాటల్లో ఏ ప్రభావం వుందో గానీ, ఆయనంటే నాలో ఓ విధమైన ఆసక్తి మొదలైంది. రెండు రోజుల తర్వాత సూపర్ బజార్‌లో ఎదురయిన ఆయన్ని బస్సులో సంఘటన ఉదహరించి పరిచయం చేసుకున్నాను. ఆయనే చలపతి.

అలా మొదలైంది చలపతితో నా స్నేహం. ఆయనకి నలభై ఏళ్ళు వుంటాయని నా అంచనా. సాహిత్యంలో ఆయనకు మంచి అభిరుచి వుండేది. నేను అడపా దడపా రాసే కథలని ఆయనకిచ్చి అభిప్రాయం చెప్పమనే వాణ్ణి. వాళ్ళ ఇంటికి వారానికి కనీసం ఒక రోజన్నా వెళ్తుండే వాడిని. మేము ఎన్నో విషయాలు చర్చిస్తుండే వాళ్ళం. మా డిస్కషన్స్‌లో ఆయన భార్య కృష్ణవేణి కూడా పాల్గొనేది. ఆవిడ మాటల్లో బయటపడే తర్కజ్ఞానాన్ని చూసి ఆశ్చర్యపోయేవాణ్ణి. ఈ సమాజంలో పెరిగిన స్త్రీ ఇంత వివేకంతో ఆలోచించగలదా అని. ఏది ఏమైనప్పటికి వారితో స్నేహం నాకు చాలా ఆనందదాయకంగా వుంది...

...రెండేళ్ళ క్రితం జ్ఞాపకాలని నెమరు వేసుకుంటూ వడివడిగా నడుస్తున్నాను. చలపతి ఇల్లు ఇంకా అరకిలోమీటరు వుంటుంది. వయస్సులో నా కన్నా పెద్దవాడైనా మా ఇద్దరి మధ్య స్నేహానికి వయస్సులో తారతమ్యం, ఎప్పుడూ అడ్డు రాలేదు. అటువంటి స్నేహశీలి నాకిక లేడు అన్న విషయం చాలా బాధగా వుంది. ఆయన చనిపోయాడన్న వార్త వినగానే మనస్సంతా ఏదోలా అయిపోయింది. కృష్ణవేణి ఈ షాక్‌కు భరించగలదా?... అప్రయత్నంగా నా నడకలో వేగం పెరిగింది. ఆమె ఈ దుఃఖాన్ని ఎలా తట్టుకోగలదో? నా ఊహకి అందని విషయం.

> భార్యా భర్తల మధ్య
> ఉండేది కేవలం
> ఆర్థిక సంబంధం కాదు.
> ప్రేమ కూడా ఉంటుంది.

సూర్యుని లేలేత కిరణాలు మెల్లిగా మంచుపొరలను చీల్చుతున్నాయి. చలపతి ఇంటి దూరం కొద్ది కొద్దిగా తరిగిపోతుంది. మూడు రోజుల క్రితమే ఆయన హాస్పిటల్ నుండి డిస్చార్జ్ అయ్యాడు. హార్ట్ ఎటాక్ నుంచి పూర్తిగా కోలుకుంటున్న సమయంలో ఇలా జరగడం నమ్మశక్యంగా లేదు. చలపతి ఇక లేడన్న వాస్తవానికి నా మనసు ఇంకా

సభాపర్వం



## 'వానరాని కాలం' కవితా సంపుటి ఆవిష్కరణ

పాండిచ్చేరి రాష్ట్ర పరిధిలోని యానాంలో ప్రముఖ కవులు, వేలాదిమంది సాహితీప్రియుల సమక్షంలో దాట్ల దేవదానంరాజు రచించిన 'వానరానికాలం' కవితా సంపుటిని జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి ఆవిష్కరించారు. మార్చి 2 ఆదివారం సాయంత్రం స్థానిక మహాత్మాగాంధీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ కళావేదికపై అపూర్వ రీతిలో ఈ సభ జరిగింది. రాష్ట్రం నలుమూలల నుండి విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొనిన 'వానరాని కాలం' కావ్యం ఆవిష్కరణ మహోత్సవ సభకు ప్రముఖ భాషా శాస్త్రవేత్త ఆచార్య చేకూరి రామారావు అధ్యక్షత వహించారు. సినారె చేతుల మీదుగా కథారచయిత వి.వి.సుబ్బరాజు తొలి ప్రతిని స్వీకరించారు. సినారె మాట్లాడుతూ కవిత వాస్తవాన్ని ప్రతిబింబించాలని, కాలాన్ని జయించే విధంగా ఉండాలని ఇది దేవదానంరాజు కవితల్లో కనిపిస్తుందని అన్నారు. అమ్మ, వానరానికాలం, వాయుగండం కవితల్ని తన సహజ కవితా ధోరణిలో ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య విశ్లేషించారు. తొలుత సభాధ్యక్షుడు ఆచార్య చేకూరి రామారావు మాట్లాడుతూ శైలీ వైవిధ్యం, ఉత్తమమైన ఊహాశక్తితో కూడిన సంకలనంగా 'వానరాని కాలం'ను అభివర్ణించారు. ఎవరి దృష్టికీ వెళ్లని విషయాలను కవితా వస్తువులుగా తీసుకుని మంచి కవిత్వంగా వెలయించాడని ప్రశంసించారు. ఇంకా సభలో డాక్టర్ ఎన్.గోపి, అద్దేపల్లి రామమోహనరావు, ఎండ్లూరి సుధాకర్, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, గరికపాటి నరసింహారావు, కె.వి.నరసమ్మ, మధునాపంతుల సూరయ్య శాస్త్రిలు ప్రసంగించారు. డాక్టర్ ఎన్.గోపి మాట్లాడుతూ మానవ సంబంధాలు, వానరాని రైతుల దైన్యం, పర్యావరణం విషయాలపై వస్తువైవిధ్యంతో కవితలు 'వానరాని కాలం'లో ఉన్నాయన్నారు. ప్రముఖ కవి అద్దేపల్లి రామమోహనరావు మాట్లాడుతూ చాలా తక్కువ వ్యవధిలోనే వర్తమాన కవిత అభివ్యక్తిని దేవదానంరాజు పట్టుకున్నాడని నిత్యజీవితాల్లోని సాధారణ విషయాలను పోలికలుగా తీసుకుని అస్పష్టతకు తావులేకుండా రచించాడని సోదాహరణంగా పేర్కొన్నారు. రీజెన్సీ సిరామిక్స్ జి.ఎం. కె.సి.చంద్రశేఖర్, సి.నారాయణరెడ్డిని జ్ఞాపికతోనూ, నూతన వస్త్రాలతోనూ సత్కరించారు. 'వానరానికాలం' ముఖచిత్రణ, కవితలకు ఇలస్ట్రేషన్ గీసిన చిత్రకారుడు అక్బరును సినారె సన్మానించారు. అనంతరం అద్దేపల్లి రామమోహనరావు అధ్యక్షతన కవిసమ్మేళనం జరిగిన కవులందరకూ జ్ఞాపికలను అందజేశారు.

—డి.శశికాంత్

అలవాటు పడలేదు. మళ్ళీ జ్ఞాపకాలు తరుముకు వస్తున్నాయి. వారం రోజుల క్రితం హాస్పిటల్‌లో జరిగిన మా సంభాషణ గుర్తుకు వస్తోంది.

"పోనీ... అయితే వేణికి నామీద నిజమైన ప్రేమ లేదంటావ్!" చలపతి అన్నాడు.

విషయం వ్యక్తిగతంగా మళ్ళేసరికి ఇబ్బందిగా ఫీల్ అయ్యాను. అది గమనించినట్టు,

"మొహమాట పడకు. కృష్ణవేణి నాకు ఇన్ని సేవలు చేస్తుందంటే కారణం ఏమిటంటావ్? రాత్రింబవళ్ళూ నిద్ర లేక నన్నే కనిపెట్టుకుని వుంటుందంటే అది ప్రేమ కాదంటావా? మూడో వ్యక్తి ఎవరైనా ఇంత ఆప్యాయంగా చూడగలరంటావా?" సూటిగా అడిగాడు.

"కృష్ణవేణి గారు మీకు ఎంతో సేవ చేస్తున్నారు. మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. కాదనను. కానీ ఆ అభిమానం, ప్రేమ అనేది కేవలం 'భర్త' అనే మీ స్థానానికి పరిమితమైనదే గానీ 'మీరు' అనే ప్రత్యేక వ్యక్తికి చెందినది కాదు. మరో విధంగా అనుకోకపోతే చిన్న ఉదాహరణ... ఈ స్థానంలో- అంటే భర్త స్థానంలో మీరు కాకుండా ఇంకొకరు వున్నప్పటికీ ఆమె అలానే సేవ చేస్తుండేవారు, ఆమె స్థానంలో వేరే వారున్నా మీరు అలానే భావిస్తారు. మీరు అనుకుంటున్నట్టు 'ప్రేమిస్తారు'... అంతే తప్ప ఈ అభిమానం ప్రత్యేకించి 'ఫలానా వ్యక్తి' మీద అని వుండదు. అలాంటప్పుడు అది ప్రేమ ఎలా అవుతుంది?" అన్నాను.

చిన్న పిల్లవాడి ఆటల్ని పెద్దరికపు ఉత్సుకతతో చూసినట్టూ సరదాగా చూస్తున్నారు. నన్ను "త్వరగా పెళ్ళి చేసుకోవోయ్. జీవితం అంటే ఏమిటో తెల్సి- నీ అభిప్రాయాలు మారతాయేమో!" అన్నాడు చలపతి.

మా సంభాషణలు ఈ విధంగా సాగేవి. ఆయన గొంతులో సన్నగా పలికే జీర ఆయన మాటలకి ఓ ప్రత్యేకతని తెచ్చిపెట్టేది. భార్య మీద ఎంతో ప్రేమ కనబరిచే వాడు. ఆమె కూడా అంతే. ఒక్క క్షణం ఆయన్ని విడిచి వుండేది కాదు. వారి దాంపత్యం చూసి 'సంసారంలో ఇంత తీయదనం ఉంటుందా' అని అనుకునే వాణ్ణి.

ఇలా గత జీవితపు ఆలోచనల్తో చలపతి ఇంటి పరిసరాల కొచ్చాను. దగ్గరి బంధువులు కాబోలు ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆ పరిసరాల ప్రభావం వల్ల నాలో దడ మొదలైంది. మంచానికి ఓ ప్రక్కగా, నేల మీద జీవం లేని చలపతిని పడుకోబెట్టారు. కృష్ణవేణి జుట్టు చెదిరి, బొట్టు చెరిగి శోకదేవతలా ఉంది. ఆ దృశ్యం చూడగానే నా ఒళ్ళంతా గుగుర్పొడిచింది.

ఒక్క క్షణం కూడా చలపతిని విడిచి వుండలేని ఆమె ఇక ముందు ఎలా వుండగలదో!! నాలో ఈ వివాహ వ్యవస్థ పట్ల వుండే తేలిక అభిప్రాయాన్ని వారి అన్యోన్యత పారద్రోలింది. 'భార్యాభర్తల మధ్య వుండేది కేవలం ఆర్థిక సంబంధం కాదు. ప్రేమ కూడా వుంటుంది' అని వారి సఖ్యత ద్వారా తెలుసుకున్నాను. అవన్నీ తలుచుకుంటుంటే కంటికి నన్నటి కన్నీటి పొర అడ్డుపడింది. ఆమెని ఎలా ఓదర్చాలో తెలియడం లేదు.

ఆమె ఏడుస్తూ ఏదో మాట్లాడడం, బాధపడడం చూస్తుంటే ఏమని ఓదార్చాలో నా మనసుకు తోచడం లేదు. ఆమె ఏడుపు కొద్ది కొద్దిగా ఎక్కువైంది. ఆమె మాటలు ఇప్పుడు కొద్దిగా స్పష్టమవుతున్నాయి... ఒకటీ... ఒకటొకటీ... మెల్లిగా మబ్బు విడినట్టూ అర్థమవుతున్నాయి... అంతే-!

కొరడాతో ఛెళ్ళున కొట్టినట్టయింది.

"నన్ను వదిలి పెట్టి వెళ్ళి పోయారాండీ! ఇక నన్ను పోషించే దిక్కెవరండీ!!"...

రెండో వాక్యం నా గుండెల్లో గునపంలా దిగింది.